మోహన్ అతనికి ఎదురుగా కుర్చీ అంచులమీద కూర్చుంటూ "చెప్పండి సార్ . ఏం ఫైల్స్ వున్నాయా సార్?" అని అడిగాడు.

"అబ్బ నువ్వు వట్టి గిపాకీ అయ్యా!" నొసలు కొట్టుకుంటూ అన్నాడు ఏకాంబరం.

"గిపాకీనా? అంటే ఏంటి సార్?" భయం భయంగా అడిగాడు మోహన్ మళ్ళీ ఎంత భయంకరమైన మాట వినాల్సి వస్తుందో అని!

"గిపాకి అంటే అమాయకుడివోయ్. అయినా ఫైల్స్ గురించి నేనే నాడైనా ఇంత టెన్షన్ ఫీలయ్యానా? మీ ఇంట్లో వుండే ఆ అమ్మాయి పేరేంటి?" అడిగాడు ఏకాంబరం.

"సీత సార్"

ఆ పేరు అంటున్నప్పుడు ఆమె నగ్నరూపం అతని మనసులో మెదలి నరాలు జివ్వుమన్నాయి.

"అదే ... అదే ఆమె బుచ్చిబాబుల గురించి ఏదో చెప్తానన్నావు?" కుతూహలంగా అడిగాడు ఏకాంబరం.

మోహన్ ఏకాంబరం వంక సందేహంగా చూసాడు.

"మరేం పర్లేదు. చెప్పు. అది చెప్పకూడని రహస్యం అయితే నేనెవరికీ చెప్పనులే" మోహన్‌కి భరోసా ఇస్తూ అన్నాడు ఏకాంబరం .

మోహన్ ఏకాంబరానికి మొత్తం పూసగుచ్చినట్టు చెప్పాడు.

"హమ్మ బుచ్చిబాబూ! నేను నువ్వేదో డింగాల డిప్పివని అనుకున్నాగానీ గొప్ప చలాకీ గిలాకీనే"

గుండెలు బాదుకున్నాడు ఏకాంబరం.

0 0 0

సాయంత్రం అయిదయ్యింది. బుచ్చిబాబు గబగబా ఫైల్స్ పర్దేశాడు. సీత దగ్గరికి వెళ్ళాలని అతని మనసు ఆరాటపడ్తోంది.

పాపం క్రితం రోజు సాయంత్రం సీత ఆ రోజు ఉదయం ఆఫీసుకు వెళ్లేటప్పుడు, తిరిగి ఆఫీసునుండి ఇంటికెళ్ళేటప్పుడు కనబడమనీ బుచ్చిబాబుకి చెప్పింది కానీ ఉదయం పార్వతమ్మ వంట ఆలస్యం చెయ్యడం వల్ల ఆఫీసుకి టైమైపోయి సీత దగ్గరికి వెళ్ళకుండా డైరెక్టుగా ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

ఇప్పుడు ఇంటికెళ్ళేటప్పుడు తప్పనిసరిగా కనిపించి తీరాలి. పాపం!! చాలా ఎదురుచూస్తూ వుంటుంది అనుకున్నాడు. కోపంగా కారాలు మిరియాలూ కూడా నూరుతుందేమో!

ఫైల్సన్నీ సర్దిపెట్టి మోహన్ దగ్గరికివెళ్ళి "ఇంక ఇంటికెళ్దామా?" అన్నాడు బుచ్చిబాబు .

మోహన్ అయిష్టంగా తల ఊపాడు. ఏకాంబరం బుచ్చిబాబుకి ఏవైనా అర్జంట్ ఫైల్స్ ఇచ్చి ఆఫీసులో లేటుగా కూర్చోబెడితే బావుణ్ణు. తను సీతతో కబుర్లేసుకోవచ్చు అనుకున్నాడు మోహన్. మోహన్ సీట్లోంచి లేచాడు.

ఇద్దరూ ఆఫీసులోంచి బయటపడ్డారు.

"పొద్దున రాలేకపోయాను. సీత నా కోసం ఎదురు చూసిందా? నేను రాలేదని కోపగించుకుందా?" అడిగాడు బుచ్చిబాబు .

"ఊహూ. అసలు నీ ప్రసక్తే తీసుకురాలేదు" కసిగా అన్నాడు మోహన్ .

నిజానికి సీత మోహన్‌తో చాలాసార్లు అంది ఏంటి బుచ్చిబాబు ఇంకా రాలేదు అని!

ఇద్దరూ బస్టాండువైపు అడుగులు వేస్తున్నారు . ఇంతలో........

"ఒరేయ్ వెధవాయ్" గట్టిగా కేక వినిపించింది.

బుచ్చిబాబు గుండెల్లో రాయి పడింది.

అది అతని తండ్రి పర్వతాలరావు గొంతు.

0 0 0

రామలక్ష్మి తలుపు తీసింది. ఆ వెనుకే సీత కూడా వచ్చి ఆత్రంగా చూసింది.

మోహన్ ఒక్కడే ఇంట్లోకి వచ్చాడు.

"అయనేరీ?" అడిగింది సీత మోహన్‌ని.

"రాలేదు" అన్నాడు మోహన్ లోపలకొచ్చి కూర్చుంటూ.

"ఆఫీసుకు రాలేదా?" మళ్ళీ అడిగింది సీత.

"ఆఫీసుకు వచ్చాడు. ఆఫీసయిన తరువాత మేమిద్దరం ఇంటికి రావాలని బయటకి వచ్చాం. అప్పుడే వాళ్ళమ్మా నాన్నా అక్కడికి వచ్చారు."

"ఎందుకూ?"

"ఇంట్లో వుంటే ఏమీ తోచక సిటీ చూద్దామని బయటకి వచ్చారంట. ఓ గంట సేపు తిరిగాక బుచ్చిబాబు వాళ్ళ అమ్మకి 'నాగదేవత మహిమలు' సినిమా పోస్టర్ కనిపించింది. దాంతో ఆవిడ ఆ సినిమా చూడాలని పట్టుపట్టింది. బుచ్చిబాబు ఆఫీసు టైమయిపోయిందికదా, అందుకని అక్కడి కొచ్చి అతన్ని కూడా ఆ సినిమాకి లాక్కెళ్ళారు!" లోలోపల ఎంతో సంతోషిస్తూ చెప్పాడు మోహన్ .

"ఆ? నాగదేవత మహిమలు సినిమా రిలీజయిందా? ఏవండీ మనం కూడా ఆ సినిమా చూసి తీరాలండి. నేనిదివరకు 'నాగరాజు నంగనాచీ' సినిమా చూసా! హబ్బ!
ఆ సినిమా ఏంత బాగుందో. నాగరాజు కోపానికి గురుయిన నాగరాజుతో శపించబడి అందులో హీరో బల్లిగానూ, హీరోయిన్ బొద్దింకగానూ మారిపోయి ఎన్ని కష్టాలు పడతారో! నాగదేవత

మహిమలు కూడా ఆ సినిమా తీసినావాళ్ళే తీసారనుకుంటా. హేవండేవండీ... మనం కూడా ఆ సినిమాడు వెళ్దామండీ" నేలమీద కాళ్ళు తపతపా కొడుతూ అంది రామలక్ష్మి.

"సరే.....సరే....సరే... వెళ్దాం ఆ చిందులెయ్యడం ఆపు" విసుక్కున్నాడు మోహన్.

సీత ముందు తన భార్య అలా చేయడం అతనికి అవమానకరంగా అనిపించింది.

మోహన్ చెప్పిన విషయం విని సీతకు ఒళ్ళు మండింది. నిజమే మరి. క్రితం రోజు సాయంత్రం నుండి బుచ్చిబాబుని మళ్ళీ ఎప్పుడు చూస్తానా అని ఎదురు చూస్తుంది ఆమె పొద్దున్న వస్తానన్నాడు రాలేదు. సాయంత్రమూ ఎగ్గొట్టాడు.

ఏం? నాకు కాస్త అర్జంట్ పని వుంది. మీరిద్దరూ సినిమా చూసి రండి అని చెప్పలేడా? ఇంత చిన్న విషయం దగ్గరే తల్లిదండ్రులకి భయపడేవాడు పెళ్ళి కాకుండా కాపురం ఎలా చేస్తాడు?

భయమా లేకపోతే నిర్లక్ష్యమా? అప్పుడే ఇంత నిర్లక్ష్యమా? చూస్తా....చూస్తా......!

పళ్ళు నూరింది సీత .

"మీరు మొహం కడుక్కోండి. నేను కాఫీ కాచి పట్టుకొస్తా" అంది రామలక్ష్మి భర్తతో.

మోహన్ ఒక్క నిముషంలో మొహం కడుక్కుని సీత ముందొచ్చి కూర్చున్నాడు. బాత్రూంలో సీత స్నానం చేయడం చూసిన దగ్గర నుండి అతను మరీ ఇదైపోతున్నాడు మళ్ళీ ఎప్పుడు తెల్లారుతుందా, సీత ఎప్పుడు స్నానం చేస్తుందా అని చాలా కోరికతో వున్నాడు.

పాపం! సీతకి తనను మోహన్ అలా చూసాడన్న విషయం తెలియదు.
తెలిస్తే ఇప్పుడతని ముందు కూర్చోగలిగేదా?

"ఏంటండి సీతగారూ విశేషాలు! మధ్యాహ్నం ఏం చేశారు?" అడిగాడు మోహన్.

"మధ్యాహ్నం దాకా పత్రికలు చదివి పడుకున్నానండీ. బుచ్చిబాబు రాత్రికిగానీ వస్తానన్నాడా?" అడిగింది సీత. మోహన్ మొహాన్ని అప్రసన్నంగా పెట్టాడు. సీత బుచ్చిబాబు పేరును ఉచ్చరించడమే అతనికి నచ్చడంలేదు.

"ఏమో....నాకేం చెప్పలేదు" అన్నాడు.

"కాఫీ....." అంటూ ట్రేతో అక్కడికి వచ్చింది రామలక్ష్మి.

మోహన్ చటుక్కున ట్రేలో ఒక కప్పు అందుకుని సీత చేతివేళ్ళు తాకుతూ ఆమెకి అందించాడు. 'హారి దేవుడా? ఇక్కడినుండి నేనెప్పుడు వెళ్తానో కదా!' అని మనసులో అనుకుంది.

ముగ్గురూ కాఫీలు తాగారు.

"నేను వంట చేస్కోవాలి!" అంటూ ఖాళీకప్పులు తీసుకుని లోపలి కెళ్ళింది రామలక్ష్మి. మోహన్ సోఫాలో కదిలాడు. తను ఇలా కూర్చుంటే లాభంలేదు. సీత దగ్గర చనువు తీస్కోవాలి. తియ్యతియ్యగా మాట్లాడాలి అనుకున్నాడు.

అతను అలా అనుకుంటుండగానే సీత లేచి నిలబడింది "అదేంటి లేచిపోయారు?

కాసేపు కబుర్లు చెప్పుకుందాం" అన్నాడు.
"లేదండీ. పాపం వదినగారు ఒక్కరే అవస్థ పడుతుంటారు. నే వెళ్ళి ఆవిడకి వంటలో సాయం చేస్తాను"

మోహన్ ఏదో అనబోయేంతలో సీత గబుక్కున లోపలికి వెళ్ళిపోయింది.

"వదినా? అంటే నేనేంటి? అన్నయ్యనా?" అనుకుని కసిగా జుట్టు పీక్కున్నాడు మోహన్ .

"ఏంటో కిల్లారికిత్తిగాడిలా అలా జుట్టు పీక్కుంటున్నావ్? ఆ? .... హిహిహి"

ఉలిక్కిపడి గుమ్మం వైపు చూశాడు. అక్కడ మేనేజరు ఏకాంబరం నిలబడి వున్నాడు.

మోహన్ ఉలిక్కిపడ్డాడు. ఇప్పుడీ కిల్లారికిత్తిగాడెందు కొచ్చాడు. రెండు క్షణాల తరువాత తేరుకుని "ర...రండి సార్" అన్నాడు.

"అదేంటి? నీకు నత్తి ఎప్పటినుండి వచ్చిందోయ్? ఆ? హిహిహి" అంటూ లోపలికి వచ్చి మోహన్ ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు.

మోహన్ చటుక్కున లేచి నిలబడ్డాడు.

"ఫర్వాలేదు కూర్చోవోయ్! నేను ఆఫీసులోనే నీకు బాస్‌ని. బైట ఫ్రెండునే" అన్నాడు ఏకాంబరం.

'ఫ్రెండా? ఇదెప్పటినుండి?' అయోమయంగా అనుకున్నాడు మోహన్ .

"కూర్చోవోయ్!" మరోసారి గట్టిగా అన్నాడు ఏకాంబరం .

మోహన్ అతనికి ఎదురుగా కూర్చున్నాడు. "ఊ...ఆఫీసులో ఎలా వుందోయ్ నీ సీటు" అడిగాడు.

"చాలా హేపిగా వుంది సార్" చెప్పాడు మోహన్.

"ఊ.....ఊ...నాకు తెలుసు! ఆ బుచ్చిబాబు లేడూ.... ఆ కిల్లారికిత్తిగాడి సీటు చాలా లైట్‌గా ఉన్నట్టుంది...రేపు నీ ఫైల్సు సగం అతనికిచ్చేయ్" మోహన్ తన చెవుల్ని తనే నమ్మలేకపోయాడు.

నిన్నటిదాకా డింగాల డిప్పి అని పొగిడిన బుచ్చిబాబుని ఈవేళ కిల్లారికిత్తి అని తిడ్తున్నాడు.

"అలాగే సార్" అన్నాడు మోహన్ అతి వినయం ప్రదర్శిస్తూ.

"సరేగానీ సీత కనబడదేం? ఇంట్లో లేదా?" హఠాత్తుగా అడిగాడు ఏకాంబరం .

మోహన్ ఉలిక్కిపడ్డాడు.

వీడు సీత గురించి అడుగుతున్నాడేం సీత గురించి వీడికెందుకు? కొంపదీసి వీడిప్పుడు సీత కోసం రాలేదుకదా?

"ఏంటోయ్ అడుగుతుంటే సమాధానం చెప్పవేం? సీత వెళ్ళిపోయిందా?" మళ్ళీ అడిగాడు.

“అబ్బే లేద్సార్. వంట గదిలో వుంది సార్ ” మోహన్ అయోమయంగా అన్నాడు.

“అలాగా? నేను రమ్మన్నానని చెప్పు” మోహన్ గతుక్కుమన్నాడు.

అయితే వీడు సీత కోసమే వచ్చాడన్నమాట. ఇలా ముసలోళ్ళు కూడా కాంపిటిషన్ కొస్తే కష్టమే! అనుకున్నాడు.

“ఇప్పుడే పిలుస్తాను సార్” అని లోపలికెళ్ళాడు మోహన్ .

ఒక నిముషంలో సీత మోహన్ బయటికి వచ్చారు.

“నమస్కారమమ్మా రారా ... కూర్చో” అన్నాడు.

సీత ఏకాంబరం ఎదురుగా సోఫాలో కూర్చుంది.

“నువ్వు కూడా కూర్చోవోయ్”

మోహన్ సీత ప్రక్కన కూర్చోబోయాడు.

“నువ్విలా నా ప్రక్కకొచ్చి కూర్చోమ్మా. అతను ప్రక్కన కూర్చుంటే నీకు ఇబ్బందిగా వుంటుంది పాపం. నేను పెద్దాడినేగా... ఫర్వాలేదు” అన్నాడు ఏకాంబరం .

సీత ఏకాంబరం పక్కన కూర్చుది.

హమ్మ కిల్లారికిత్తిగా! ఎంత దెబ్బకొట్టావురా! అనుకుంటూ ఎదురుగా కూర్చున్నాడు మోహన్ .

“చూడమ్మా....నీకు ఉద్యోగం చేయడం ఇష్టమేనా?” అడిగాడు ఏకాంబరం సీతని.

ఇష్టమే అన్నట్టు తల ఊగించింది సీత .

“మరి మా ఆఫీసులో టెంపరరీగా ఎవరినయినా అపాయింట్ చేస్కుందామని మంచి క్యాండిడేట్ వుంటే చెప్పమని బుచ్చిబాబుకి చెప్పాను నీకు చెప్పాడా?”

“లేదండీ” అంది సీత.

ఏకాంబరం ఆశ్చర్యంగా చూసాడు. “ఏంటీ చెప్పలేదా? అంటే నిన్ను మంచి క్యాండిడేట్ కాదని అనుకున్నాడేమో...” అంటూ గొల్లున నవ్వేశాడు.

సీత మొహమాటంగా నవ్వింది. మోహన్ లోపల్లోపల పళ్ళు నూరాడు.

“నిన్ను చూస్తుంటే చాలా తెలివైనదానిలాగా, చాలా చలాకీదానిలాగా కనిపిస్తున్నావు. నీకు నేను ఉద్యోగం ఇవ్వాలని అనుకుంటున్నా. అఫ్‌కోర్స్...టెంపరరీ గానే అనుకో ... నీ కిష్టమేనా?” అడిగాడు ఏకాంబరం .

“ఇష్టమేనండీ.....” సంతోషగా అంది సీత.

“వెరీగుడ్ రేపే వచ్చి ఉద్యోగంలో జాయిన్ అయిపో”

సీత భుజం తట్టాడు ఏకాంబరం.

మోహన్ మొహం పాలిపోయింది.

0 0 0

అప్పుడు రాత్రి ఎనిమిది గంటలయింది. అంతకు ఓ పావుగంట ముందుదాకా ఏకాంబరం నానా చెత్తా మాట్లాడి వెళ్ళాడు. తను ఎక్కడెక్కడ పని చేసాడూ తను పని చేసిన చోట ఆఫీసుల్ని ఎలా డెవలప్ చేసాడూ సీతకు బాగా కోతలు కోస్తూ చెప్పాడు.

ఏకాంబరం వెళ్ళిన అయిదు నిముషాలకి రామలక్ష్మి గుళ్ళో హరి కధా కాలక్షేపం వుందని గంట్లో వస్తానని చెప్పి వెళ్ళిపోయింది.

మోహన్ హాల్లో కూర్చుని టీవీ వంక అసహనంగా చూస్తున్నాడు.

సీత లోపల ఏం చేస్తోంది?

సోఫాలోంచి లేచి మెల్లగా బెడ్‌రూం దగ్గరకెళ్ళి లోపలికి తొంగి చూసాడు.

సీత మంచంమీద వెల్లకిలా పడుకుని వారపత్రి కేదో చదువుతోంది.

తను ఇంక త్వరపడాలి! లేకపోతే రామలక్ష్మి హరికధ నుండి వచ్చేస్తుంది..

మోహన్ పిల్లిలా ఆడుగులు శబ్దం కాకుండా వేస్కుంటూ గదిలోకి ప్రవేశించాడు.

సీత మోహన్ గదిలోకి రావడం గమనించలేదు. ఆమె పత్రిక చదవడంలో పూర్తిగా లీనమైవుంది. మోహన్ ఆమెని సమీపించి చేతిలోని వారపత్రిక లాగి పక్కకి పడేశాడు.

సీత ఉలిక్కిపడింది. మోహన్ చూసి ఆమె గబుక్కున లేచి కూర్చుంది మొదట ఆమెకి ఏమీ అర్దం కాలేదు. కానీ అతని మొహంలోని ఎక్స్‌ప్రెషన్ చూసాక ఆమెకి అర్థం అయిపోయింది.

"ఏంటిది?" అడిగింది సీత కఠినంగా.

"ఏంటో నోటితో చెప్పడం ఎందుకూ చేసి చూపిస్తా" అంటూ మోహన్ ఆమె మీదకి దూకి గట్టిగా పట్టుకున్నాడు.

"ఛీ....వదులు......వదులు " సీత గింజుకుంది.

"వదేలేస్తా !....... కానీ నా కోరిక తీరాక వదిలేస్తా"

"మోహన్ ...దిసీజ్ టూ మాచ్. నా గురించి నువ్వేమనుకుంటున్నావు?" కోపంగా అరిచింది సీత.

"నీ గురించి చాలా అనుకుంటున్నా , అందుకేగా ఇలా పట్టుకున్నా" మోహన్ తన పట్టుని మరింత బిగించాడు.

"ఛీ.... నేనలాంటిదాన్ని కాదురా.... వదులు"

"పెళ్ళి కాకుండా కాపురం చేసేదానివి నువ్వెలాంటిదానివో నాకు విడిగా చెప్పనక్కరలేదు."